క్లుప్తంగా

అవయవ దానానికి అంగీకారం


దాడిశెట్టి శ్రీనివాస్‌కు అవయవ దాన అంగీకార పత్రాన్ని అంజేస్తున్న దాతలు

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సోదరుడు, దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలువురు మరణానంతరం అవయవ దానానికి అంగీకరించారు. బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎస్.అన్నవరానికి చెందిన ఆచంట నరసయ్య, ఉపాధ్యాయుడు నల్లల వెంకట లక్ష్మీనారాయణ, లక్ష్మి భవానీలు తమ మరణానంతరం అవయవ దానం చేయనున్నట్లు అంగీకార పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో 30 మంది అభిమానులు రక్తదానం చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు దొరబాబు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రౌతులపూడి: మామిడి సాగులో రైతులంతా యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో మామిడి రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. పిందెలు బఠాని గింజ లేదా నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు 10 గ్రాముల యూరియా ఒక లీటరు నీటిలో కలిపి 20–30 రోజులకొకసారి పిచికారీ చేయాలన్నారు. దీని వల్ల పిందెరాలడం తగ్గుతుందన్నారు. నీటి ఎద్దడికి గురికాకుండా తేలికపాటి తడులు ఇవ్వాలన్నారు. తామర, తేనె మంచు పురుగు ఆశించకుండా ఎసిఫేట్ 1.5 మిల్లీ గ్రాముల మందును ఒక లీటరు నీటిలో కలిపి పిందె ఏర్పడిన తరువాత ఒకసారి, 30 రోజుల తరువాత మరోసారి పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల టెంక పురుగులు పట్టకుండా ఉంటాయన్నారు.

ప్రత్తిపాడు రూరల్: సాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి వైవీ గంగాధర్ తెలిపారు. పెద్దిపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీసీఎన్ఎఫ్ ఐబీ ఎన్‌డీపీ ఎం.మల్లేశ్వరి, ఎఫ్‌టీసీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సీతారాములు (ఫైల్)

కిర్లంపూడి: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రమణయ్యపేటకు చెందిన దాడి సీతారాములు (46) మంగళవారం స్థానిక రామాలయం వద్ద ఏకాహాన్ని పురస్కరించుకుని చలువ పందిరి వేస్తున్నాడు. పైకెక్కి అడ్డుకర్రలు కడుతూ జారి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే అతన్ని స్థానికులు ఆటోలో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సీతారాములు మరణించినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు. ఇంట్లో పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

ఉద్యోగ మేళాలో ఆరుగురి ఎంపిక


ఉద్యోగ నియామక పత్రాలు చూపుతున్న విద్యార్థులు

జగ్గంపేట: నిరుత్సాహ పడకుండా ప్రయత్నిస్తేనే విజయం వరిస్తుందని జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఒమ్మి రఘురాం అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంక్ నిర్వహించిన జాబ్ మేళా ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఉద్యోగాలకు ఎంపికైన ఆరుగురికి ఆయనతో పాటు ఎస్‌ఐటీ హెచ్‌ఆర్ పృథ్వీ, ప్రిన్సిపాల్ చంద్రనాయుడు నియామక పత్రాలు అందజేశారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

గోకవరం: తంటికొండలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించనున్నట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. రాజమహేంద్రవరం దేవదాయశాఖ అధికారి పర్యవేక్షణలో లెక్కింపు ఉంటుందన్నారు. అయితే ఈ లెక్కింపును అడ్డుకుంటామని దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు (రెడ్డి) ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల భక్తులు హుండీలో వేస్తున్న డబ్బుల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని, విచారణ నిర్వహించాలని కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని ఈఓ హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు ట్రస్టు బోర్డు తీర్మానం లేకుండా హుండీలను తెరిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారన్నారు. అక్రమాలపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకున్న తరువాతే హుండీలను తెరవాలన్నారు.

స్వగృహానందం


వి.కొత్తూరు జగనన్న కాలనీలో రూపుదిద్దుకున్న ఇళ్లు


ఎస్.అన్నవరం జగనన్న కాలనీలో శరవేగంగా ఇళ్ల నిర్మాణం

- పేదల కల సాకారమవుతున్న వేళ
- శరవేగంగా ఇళ్ల నిర్మాణ పనులు
- జగనన్న కాలనీల్లో సౌకర్యాల కల్పన

తుని రూరల్: కొత్త ఊరొకటి పురుడు పోసుకుంటోంది.. నిరు పేదలకు నీడనివ్వడానికి వస్తోంది.. అర్హుల సొంతింటి కలను నిజం చేసేందుకు శరవేగంగా సిద్ధమవుతోంది.. పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల వేగం జోరందుకుంది. ప్రభుత్వం అందిస్తున్న రుణం, డ్వాక్రా రుణంతో పాటు లబ్ధిదారులు కొంత మొత్తాన్ని సమకూర్చుకుని గృహ నిర్మాణ పనులను కొందరు పూర్తి చేస్తున్నారు. దీంతో ఆ ఇళ్లలో వారు గృహ ప్రవేశాలు సైతం చేస్తున్నారు. నియోజకవర్గంలో తుని పట్టణం, రూరల్, తొండంగి మండలాల్లో మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సంవత్సరం ఉగాది రోజు గృహ ప్రవేశాలు చేయాలని ప్రభుత్వం సంకల్పించినా ఎమ్మెల్సీ కోడ్ ఉండడంతో అధికారికంగా గృహ ప్రవేశాలు జరిగే అవకాశం లేదని గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో తుని పట్టణం, రూరల్, తొండంగి మండలాలు ఉన్నాయి. కోటనందూరు మండలం కొడా పరిధిలో లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు రుణాలు మంజూరు కాలేదు. దీంతో తుని అర్బన్, రూరల్, తొండంగి మండలాలకు మొదటి విడతగా 11,540 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 9,113 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉండగా, 2,370 ఇళ్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా 57 గృహ నిర్మాణాలు చేపట్టలేదు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలకు రూ.58,15,70,404 జమ చేసింది. రూ.4,81,58,414 విలువైన ఇనుము, సిమెంట్ రాయితీపై, ఇసుక ఉచితంగా అందించింది.

మండలాల వారీగా వివరాలు ఇలా..

మండలం	మంజూరైన ఇళ్లు	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తయినవి	చెల్లింపులు (రూ.లలో)	మెటీరియల్‌కు
తొండంగి	2,943	1,931	981	17,73,46,889	1,01,25,645
తుని రూరల్	2,903	2,326	565	12,76,25,417	2,45,90,480
తుని పట్టణం	5,694	4,856	824	27,65,98,098	1,34,42,289

సొంతిల్లు సమకూరింది


జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు గృహ రుణం మంజూరు చేసింది. ఆ సహకారానికి తోడు కొంత సొమ్ము వేసుకుని ఇల్లు నిర్మించుకున్నాం. ఇటీవలే గృహ ప్రవేశం కూడా చేశాం. సొంతింటి కల సాకారమవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

–రావాడ లోవకుమారి, కొత్తూరు, తుని మండలం

లక్ష్యాలకు అనుగుణంగా..


ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు వాయిదా పడే అవకాశం ఉంది.

–ముద్రగడ నాయుడు, ఏఈ హౌసింగ్, తుని రూరల్

సరుగుడు తోటలో గౌర్రె గేదె కళేబరం


తోటలో మృతిచెందిన గౌర్రె గేదె

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగిలోని సరుగుడు తోటలో బుధవారం గౌర్రె గేదె కళేబరం దర్శనమిచ్చింది. ఐదు రోజుల కిందట ఇది చనిపోయి ఉంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. జనవరి 1న పోతులూరు సమీపంలో పోలవరం కాలువలో గౌర్రె గేదె స్థానికులు కంటపడింది. ఇప్పుడు గౌర్రె గేదె కళేబరం ఆ ప్రాంతానికి సమీపంలో దర్శనమిచ్చింది. అప్పుడు కనిపించిన గౌర్రె గేదె ఇప్పుడు చనిపోయిందా లేక మరో గౌర్రె గేదె వచ్చిందా అనే ప్రశ్న స్థానికంగా నెలకొంది. గత ఏడాది మే 22న ఇదే ప్రాంతంలో పాడి గేదె కళేబరాన్ని స్థానికులు గుర్తించారు. అప్పట్లో ఈ గేదె మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. అనంతరం ఫారెస్టు అధికారులు పులి దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం నెలల తరబడి పులి కోసం గాలింపు చేపట్టారు. ఇదిలాఉంటే ఫారెస్ట్ డీఆర్‌ఓ జాన్సన్, బీట్ ఆఫీసర్ రమణ తదితరులు గౌర్రె గేదె కళేబరాన్ని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

వైభవంగా చండీ హోమం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి మెట్ల దారిలో కొలువైన కనకదుర్గమ్మ వారి జన్మ నక్షత్రం మూల సందర్భంగా బుధవారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రత్యేక పూజల అనంతరం హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. ఈ కార్యక్రమాలను సత్యదేవుని ఆలయ అర్చకుడు కంచిబట్ల రామ్‌కుమార్, పరిచారకుడు పవన్, కనకదుర్గ ఆలయ పరిచారకుడు నర్సింహమూర్తి, వ్రత పురోహితులు చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు.

'ఆర్ఆర్' చిత్ర బృందం సందడి


రౌతులపూడిలో ఆర్ఆర్ చిత్ర బృంద సభ్యులతో స్థానికులు

రౌతులపూడి: ఓం శ్రీసత్యదేశాయ ఫిల్మ్స్ నిర్మాణంలో కోటిపల్లి బుజ్జి నిర్మాతగా వీఎస్‌వీవీ మణికంఠ దర్శకత్వంలో నిర్మించిన 'ఆర్ఆర్' చిత్ర బృందం బుధవారం రౌతులపూడిలో సందడి చేసింది. స్థానిక మహాలక్ష్మి థియేటర్‌లో చిత్రం విడుదల సందర్భంగా నటీనటులు రాజా మొగలి, దియారాజు, చర్ల గీత, గణేష్, మధు, సరిపల్లి తదితరులు సందడి చేశారు. వారంతా మహాలక్ష్మి థియేటర్‌ను సందర్శించి ప్రేక్షకులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ముప్పైకు పైగా థియేటర్లలో ఈ చిత్రం విడుదల చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రాన్ని ఆదరించి మంచి విజయాన్ని అందించాలని యూనిట్ సభ్యులు కోరారు. థియేటర్ యజమాని గొల్లు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

19న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ

తొండంగి: రావికంపాడులో 19న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని జగ్జీవన్‌రామ్ సంఘం సభ్యులు కాకాడ గంగారావు, ఇందుగపల్లి వీరబాబు తదితరులు బుధవారం తెలిపారు. ఈ విగ్రహ ఆవిష్కరణకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్

గోకవరం: వీరలంకపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపల్ కేఎమ్‌వీ రాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఏప్రిల్ 23 వరకూ గడువు ఉందన్నారు. ఈ నెల 23న పాఠశాలలో ఉచితంగా ఆన్‌లైన్ చేస్తామని, ఆసక్తి ఉన్నవారు విద్యార్థిని ఆధార్, పుట్టిన తేదీ, కులం, తల్లి, తండ్రి పేర్లు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంప్రదించాలన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

ప్రత్తిపాడు: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కాకినాడ జిల్లా ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ ఆదేశించారు. ప్రత్తిపాడు గోకవరపు వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వీవీ అరుణశ్రీ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రవీణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వైఎస్సార్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చక్రవేణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

ప్రత్తిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని కాకినాడ జిల్లా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం క్షేత్రస్థాయి సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి పథకంలో చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి, కొలతలను నమోదు చేయాలన్నారు. ప్రతి కూలీకి రూ. 257 వచ్చేలా పనులు చేపట్టాలన్నారు. మండలంలో 5,95,145 పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో 2,99,702 పనిదినాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 2,95,443 పనిదినాలు కల్పించడంతో పాటు పని కొలతల ప్రకారం చేయించాలని ఆదేశించారు. ఉత్తరకంచి, రాచపల్లి గ్రామాల్లో పనులను పరిశీలించానన్నారు. ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, ఉపాధి పథకం ఏపీఓ ఏబీవీ నాయుడు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

ప్రత్తిపాడు: స్థానిక ఎస్‌హెచ్ రహదారి సమీపంలో తాటాకిల్లు దగ్ధమై నిరాశ్రయులైన మధులత, అంబికాదేవి కుటుంబాలకు జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో గ్యాస్ సిలెండర్, స్టవ్, నిత్యావసర వస్తువులు, బియ్యం, రూ.5 వేలు అందజేశారు. గ్రామ యువత బొబ్బర ప్రసాద్, లాజర్, మూరా ప్రసాద్, తమ్మన్న, నానీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ రామ్మోహన్ తెలిపారు. ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వంటి విభాగాల్లో కృషి చేస్తున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అంతా ప్రశాంతం

- ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం
- ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ఏలేశ్వరం/రౌతులపూడి/ప్రత్తిపాడు/తుని/కిర్లంపూడి/శంఖవరం: తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి 9 నుంచి 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఏలేశ్వరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 336 మంది విద్యార్థులకు 324 మంది, గురుకుల కళాశాలలో 302 మందికి 287 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. గురుకుల కళాశాల వద్ద హాల్‌టిక్కెట్ల నంబర్ల బోర్డు బయట పెట్టకపోవడంతో విద్యార్థులు రూమ్‌లు తెలుసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. గురుకుల కళాశాలలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా చంద్రశారద, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పలివెల శివాజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్‌హెచ్ కుమారి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా కె.చినబుజ్జి వ్యవహరించారు. రౌతులపూడి మండలం ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 342 మంది విద్యార్థులకు ఒకరు మిగతా అంతా హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి జి.లక్ష్మణరావు తెలిపారు. 16 మంది ఇన్విజిలేటర్లు పర్యవేక్షించారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రత్తిపాడు హర్షవర్ధన జూనియర్ కళాశాలలో తొలిరోజు జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షకు 12 మంది గైర్హాజరయ్యారు. 383 మందికి 371 మంది హాజరైనట్టు అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ ఆనందకుమార్ జోషీ తెలిపారు. తుని పట్టణంలోని ఏడు కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కస్టోడియన్‌లు రమేష్, ప్రభాకర్ తెలిపారు. రాజా కళాశాల, శ్రీప్రకాష్, ప్రభుత్వ బాలికల కళాశాల, సిద్ధార్థ, వివేకా, వైష్ణవి, ఎస్వీ కళాశాల సెంటర్లలో తెలుగు, సంస్కృతం పరీక్షకు 2,341 మంది విద్యార్థులు హాజరయ్యారు. 103 మంది గైర్హాజరయ్యారు. కిర్లంపూడి ప్రభుత్వ కళాశాలలో తొలి రోజు 483 మందికి 466 హాజరు కాగా, ప్రగతి జూనియర్ కళాశాలలో 313 మందికి 294 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు పరీక్షల నిర్వాహణ అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్సై టి.రఘునాథరావు తదితరులు పర్యవేక్షించారు. శంఖవరం మండలం కత్తిపూడి సీతారామా కళాశాలలో 173 మందికి 169, శంఖవరం ఆదర్శ పాఠశాలలో 367 మందికి 344 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాజేంద్ర తెలిపారు.


ఏలేశ్వరంలో పరీక్ష అనంతరం కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు


తుని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


తునిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సుధారాణి

తుని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న సమస్యల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తెలిపారు. బుధవారం స్థానిక ఒకటో వార్డు నెహ్రూనగర్‌లో రూ.20 లక్షలతో రోడ్లు, పైపులైన్ల పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. మంత్రి దాడిశెట్టి రాజా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఒకటో వార్డులో పర్యటించిన సమయంలో ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టినట్లు ఆమె వివరించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను పాల్గొన్నారు.

ఇళ్లు త్వరగా నిర్మించుకోండి


జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎంపీపీ రాజుబాబు

శంఖవరం: జగనన్న కాలనీలో ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు ఎంపీపీ పర్వత రాజుబాబు సూచించారు. కొంతంగి కొత్తూరులో జగనన్న కాలనీని పరిశీలించి విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. సర్పంచ్ దూడల రామస్వామి, ఎంపీటీసీ నడిగట్ల నానాజీ, వైఎస్సార్ సీపీ కాకినాడ బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇక్కట్లు


సర్వీస్ రోడ్డును బ్లాక్ చేయడంతో రోడ్డుపై వాహనాలు

గండేపల్లి: హైవే అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నీలాద్రిరావుపేట పరిధిలో ఆదిత్య హాస్పిటల్ ఎదురుగా బ్రిడ్జిని ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో హైవేపై ఉన్న విద్యుత్ దీపాల మరమ్మతులను హైవే అధికారులు చేపట్టారు. దీంతో సర్వీస్ రోడ్డులో వాహన రాకపోకలను నిలిపివేశారు. రాజమహేంద్రవరం వైపు నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా జగ్గంపేట కాంప్లెక్స్‌కు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు, కాకినాడ, గోకవరం మార్గాల వైపు వెళ్లాల్సిన ఆటోలు, ఇతర వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చిన బస్సులు బ్రిడ్జి దగ్గర నిలిపి ప్రయాణికులను దింపేయడంతో కాంప్లెక్స్, సెంటర్‌లోకి వచ్చేందుకు అవస్థలు పడ్డారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన


బోరుకు శంకుస్థాపన చేసిన గ్రామ పెద్దలు, తూర్పుకాపు, వెలమ సంఘం నాయకులు

గోకవరం: స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న కమ్యూనిటీ భవనం వద్ద బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తూర్పు కాపు, వెలమ సంఘాలకు కేటాయించారు. ఆ భవనం అభివృద్ధికి ఇరు సంఘాల సభ్యులు చర్యలు చేపట్టారు. పంచాయతీ నిధులతో బుధవారం అక్కడ బోరుకు శంకుస్థాపన చేశారు. అలాగే మండల పరిషత్ నుంచి రూ. 5 లక్షలు, జిల్లా పరిషత్ నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగలు ప్రకటించగా తన తల్లి సుంకర సావిత్రి జ్ఞాపకార్థం రూ.లక్షను వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు ప్రకటించారు. మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు, సొసైటీ మాజీ అధ్యక్షులు దాసరి తమ్మన్నదొర, దాసరి చినబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టండి


సచివాలయ కార్యదర్శులతో సమీక్షిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

తుని: స్థానిక పురపాలక సంఘానికి సంబంధించి పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని కమిషనర్ ప్రసాదరాజు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనుందని, ఆస్తి, ఖాళీ స్థలాలు, కుళాయి పన్నులను సంబంధిత యజమానుల నుంచి వసూలు చేయాలన్నారు. నిర్ణీత సమయంలో చెల్లించకపోతే తీసుకునే చర్యలను వివరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వద్దని సూచించారు. రెవెన్యూ అధికారి సాల్మన్‌రాజు, ఆర్‌ఐలు శివాజీ, వల్లీ పాల్గొన్నారు.

ఈ–క్రాప్ జాబితా ప్రదర్శన

కిర్లంపూడి: సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఈ–క్రాప్ జాబితాలను రైతులు పరిశీలించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జోకా అమృత తెలిపారు. రబీ సాగుకు ఈ–క్రాప్‌లో నమోదు చేసిన రైతుల పేర్లతో కూడిన జాబితాను బుధవారం రామచంద్రపురం గ్రామ సచివాలయంలో ఆమె ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 11,850 ఎకరాలలో 6,155 మంది రైతులు వ్యవసాయ, ఉద్యాన, ఇతరాత్ర పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఈ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 17వ తేదీ లోగా లిఖిత పూర్వకంగా వీఏఏలకు తెలపాలన్నారు.